కవిత ఈడీ కస్టడీ గడువు పొడిగింపు

హైదరాబాద్ లో ఈడీ సోదాలు...
న్యాయపోరాటం చేస్తాం.. : ఎమ్మెల్సీ కవిత.

05

www.aksharadarbar.com
శుక్రవారం 23, మార్చి 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంచిక :47 | సంపుటి :02 | పేజీలు : 05 | వెల : 06

పోరాడి.. లక్ష్యం ముద్దాడి

- ప్రజా సమస్యలపై పోరాటం.. కాలనీల సమస్యలపై పాదయాత్రలు
- స్నేహానికి విలువనిచ్చే వ్యక్తిత్వం..
- నమ్ముకున్న కార్యకర్తలకు వెన్నంటే..
- కేసులు, బెదిరింపులు, నిర్బాంధాలకు లొంగని నేత
- ప్రాణం ఉన్నంత వరకు కాంగ్రెస్‌తోనే పయనమంటున్న నాయిని...

సామాన్య కార్యకర్త నుంచి ఎమ్మెల్యేగా నాయిని రాజేందర్

పొలిటికల్ లైఫ్ స్టైల్

స్నేహానికి ప్రాణామిస్తారాయన.. నచ్చిన, మెచ్చిన వ్యక్తి కోసం ఎంత వరకైనా పోరాటం చేస్తారు. కార్యకర్తలకు వెన్నంటే ఉంటారు. కేసులు, నిర్బాంధాలు లొంగని నైజం ఆయనది. బెదిరింపులకు భయపడని ధీరత్వం ఆయనది. ఇతర పార్టీల నుంచి ఆఫర్ వచ్చినా సున్నితంగా తిరస్కరించారు. కాంగ్రెస్‌లో సామాన్య కార్యకర్తగా ప్రారంభమైన ఆయన ప్రస్తానం.. ఎమ్మెల్యేగా గెలిచి నిలిచారు. ప్రజాక్షేత్రంలో సమస్యలపై పోరాటం చేసి వాటి పరిష్కారానికి కృషి చేశారు. ఒడిదొడుకులు.. అవమానాలు.. అవహేళనలు, కష్టాలు, నష్టాలు భరించి చివరకు అనుకున్న లక్ష్యం సాధించారు. అసెంబ్లీలో అడుగుపెట్టి తన ఆకాంక్ష నెరవేర్చుకున్నారు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.. ఆయన కుటుంబ నేపథ్యం, రాజకీయ ప్రస్థానం తదితర అంశాలపై 'అక్షర దర్బార్' ప్రత్యేక కథనం..

సెంటర్ స్ప్రెడ్ లో..

– అక్షర దర్బార్, వరంగల్ ప్రధాన ప్రతినిధి

ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ ట్విస్ట్

- ప్రణీత్ తో కలిసి మరో ఇద్దరి ప్రమేయం..
- పోలీసుల అదుపులో భూపాలపల్లి అదనపు ఎస్పీ భుజంగరావు

2

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకున్నది. భూపాలపల్లి అదనపు ఎస్పీ భుజంగరావుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంటెలిజెన్స్ పొలిటికల్ వింగ్ లో అదనపు ఎస్పీగా పని చేశారు. ఫోన్ ట్యాపింగ్ లో ఆయన అదుపులోకి తీసుకొని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ప్రణీత్ రావుతో కలిసి భుజంగరావు, తిరుపతి రావు ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు అధికారులు గుర్తించారు.

ఆ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

- బాలికపై లైంగిక దాడి.. ఫోక్సో కేసు.. రిమాండ్ కు తరలించిన పోలీసులు
- సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసిన ఐజీ

5

భాజపా వారు మన సోదర సోదరీమణులు

- కేజ్రీవాల్ అరెస్టు ఆశ్చర్యపరచలేదు
- ఆప్ అధినేత సందేశాన్ని 'ఎక్స్'లో వెల్లడించిన ఆయన సతీమణి

2

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

బీజేపీ నాయకులు మన సోదరులే..

- కేజ్రీవాల్ అరెస్టు ఆశ్చర్యపరచలేదు
- ఆప్ అధినేత సందేశాన్ని 'ఎక్స్'లో వెల్లడించిన ఆయన సతీమణి సునీత

అక్షర దర్బార్, ఢిల్లీ ప్రతినిధి : కేజ్రీవాల్ అరెస్టు ఆశ్చర్యపరచలేదని, భాజపా నేతలు తమ సోదరసోదరీమణులంటూ.. ఈడీ కస్టడీలో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సందేశాన్ని ఆయన భార్య సునీత ఎక్స్ వేదికగా వెల్లడించారు. అరెస్టు విషయంలో భాజపా నేతలపై ఎలాంటి ద్వేషం చూపించొద్దని కోరారు. ఈ అరెస్టు ఆశ్చర్యపర్చలేదన్నారు. "సమాజం కోసం మీ పని కొనసాగించండి. భాజపాను ద్వేషించకండి. వారు మన సోదరసోదరీమణులు. దేశాన్ని బలహీనపరిచే ఎన్నో శక్తులు ఉన్నాయి. జాగ్రత్తగా ఉండండి. అలాంటి శక్తుల్ని గుర్తించి, ఓడించండి. మీ సోదరుడు, కుమారుడినైన నాపై ఢిల్లీ మహిళలు నమ్మకం ఉంచాలని కోరుతున్నాను. నన్ను సుదీర్ఘకాలం కటకటాల వెనక ఉంచే జైలే లేదు. త్వరలో వచ్చి మీకిచ్చిన హామీలను నెరవేర్చుతాను" అని ఆయన మాటలను సునీత వెల్లడించారు.

ఢిల్లీ ముఖ్యమంత్రి ఎవరు?

కేజ్రీవాల్ అరెస్టును సునీత ఖండించారు. అధికార వ్యామోహంతో, నియంతృత్వంతో ప్రతి ఒక్కరినీ అణచివేయాలని ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారంటూ 'ఎక్స్'లో ఆమె ధ్వజమెత్తారు. 'ఎక్కడున్నా కేజ్రీవాల్ జీవితం దేశానికే అంకితం. ప్రజలే అంతిమ నిర్ణేతలు. వారికి అన్ని విషయాలు తెలుసు. జైహింద్' అని పోస్టు పెట్టారు. ప్రస్తుతం జైల్లో ఉన్నా కేజ్రీవాలే ముఖ్యమంత్రి బాధ్యతలను కొనసాగిస్తారని ఆప్ ప్పటికే ప్రకటించింది. ఒకవేళ.. ఆయన సీఎం పదవికి రాజీనామా చేయాల్సి వస్తే.. ఆ స్థానం భర్తీ చేసేందుకు పార్టీ నుంచి విద్యా శాఖ మంత్రి ఆతిశీ, వైద్య శాఖ మంత్రి సౌరబ్ భరద్వాజ పేర్లు తెరపైకి రావచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. వీరితో పాటు సునీత పేరు కూడా రేసులో నిలిచే అవకాశం ఉంది. ఆమె రెవెన్యూ సర్వీస్ మాజీ అధికారిణి. ప్రస్తుతం వీడియో సందేశం తర్వాత తదుపరి సీఎం ఆమే అంటూ ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

అక్కడ సోదాలు.. ఇక్కడ కుదుపులు..!



- ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ ట్విస్ట్
- ప్రణీత్ తో కలిసి మరో ఇద్దరి ప్రమేయం..
- పోలీసుల అదుపులో భూపాలపల్లి అదనపు ఎస్పీ భుజంగరావు
- విదేశాల్లో ఉన్న ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్, హైదరాబాద్ సిటీ మాజీ టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధాకృష్ణారావు..

అక్షర దర్బార్,హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకున్నది. భూపాలపల్లి అదనపు ఎస్పీ భుజంగరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన ఇంటెలిజెన్స్ పొలిటికల్ వింగ్లో అదనపు ఎస్పీగా పని చేశారు. ప్రణీత్ రావుతో కలిసి భుజంగరావు, తిరుపతి రావు ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసులో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుతో పాటు హైదరాబాద్ సిటీ మాజీ టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధాకృష్ణారావు, ఇంటెలిజెన్స్ మాజీ ఎస్పీ ఎస్పీ భుజంగరావు, అడిషనల్ ఎస్పీ తిరుపతన్న ఇళ్లలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ప్రస్తుతం ప్రభాకర్ రావు, రాధాకృష్ణారావు విదేశాల్లో ఉన్నట్లు సమాచారం.

ఓ మీడియా ప్రతినిధి ఇంట్లో సోదాలు..

ఎస్ఐబీ కేంద్రంగా జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఉచ్చు ఓ మీడియా ఛానల్ అధినేతకు చుట్టుకుంది. మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్ రావు ఇన్ఫార్మరుగా వ్యవహరించినట్టు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. శుక్రవారం రాత్రి సిట్ అధికారులు జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించారు. ప్రణీత్ రావు అరెస్టు తర్వాత సదరు మీడియా అధినేత అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం.

సింహ వాహన సేవలో లక్ష్మీ నారసింహుడు..

అక్షర దర్బార్,రేగొండ : మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శనివారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఉదయం సింహ వాహన సేవలో స్వామివారిని మేళా తాళాలు, డప్పు చప్పుళ్ల మధ్య వైభవంగా ఊరేగించారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో బిల్లా శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, అర్చకులు, కమిటీ సభ్యులు మల్లెబోయిన శ్రీధర్, మూల ఓంకార్, డోబిలి కోటేశ్వరరావు, కనుకుంట్ల జోగేందర్, పేరాల తిరుపతి, పొలుసాని శ్రీనివాసరావు, లింగంపల్లి తిరుపతిరావు, గ్రామస్తులు కనుకుంట్ల దేవేందర్, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



సింహ వాహనంపై ఊరేగుతున్న నారసింహుడు

16 స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారు

హైదరాబాద్ స్థానంపై కొనసాగుతున్న ఉత్కంఠ

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : త్వరలో జరగబోయే లోకసభ ఎన్నికలకు అన్ని పార్టీలు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రధాన పార్టీలు ప్రకటించాయి. తాజాగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శనివారం మరో మూడు స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. దీంతో హైదరాబాద్ మినహా 16 స్థానాలకు అభ్యర్థులు ఖరారయ్యారు. హైదరాబాద్ టికెట్ పై ఉత్కంఠ నెలకొంది. ఖమ్మం–నామా నాగేశ్వర్ రావు, మహబూబాబాద్(ఎస్టీ)– మాలోత్ కవిత, కరీంనగర్: బోయినిపల్లి వినోద్ కుమార్, పెద్దపల్లి (ఎస్టీ) – కొప్పుల ఈశ్వర్, మహబూబ్ నగర్–మన్నె శ్రీనివాస్ రెడ్డి, చేవెళ్ల–కాసాని జ్ఞానేశ్వర్, వరంగల్ (ఎస్సీ)–డాక్టర్ కడియం కావ్య, జహీరాబాద్–గాలి అనిల్ కుమార్, నిజామాబాద్–బాజిరెడ్డి గోవర్ధన్, మల్కాజ్ గిరి–రాగిడి లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్–ఆత్రం సక్కు, నల్గొండ–కంచర్ల కృష్ణారెడ్డి, మెదక్ –వెంకట్రామి రెడ్డి, నాగర్ కర్నూల్ – ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, సికింద్రాబాద్ –పద్మారావు గౌడ్, భువనగిరి నుంచి క్యామ మల్లేష్ బరిలో ఉన్నారు.

కేసీఆర్ నివాసంలో బీఆర్ఎస్ నేతలు

చెక్ పోస్టులను తనిఖీ చేసిన సీపీ

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శనివారం పలు చెక్ పోస్టులను తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పలు చోట్ల చెక్ పోస్టులను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల కోడ్ అమలవుతున్న సమయంలో సీపీ రాయపర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని కిష్టాపురం ఎన్నికల చెక్ పోస్టును ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీ సమయాల్లో ప్రజలతో మార్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని సిబ్బందికి సూచించారు. అదే సమయంలో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.

క్షయ వ్యాధి రహిత జిల్లాగా మార్చాలి..

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంకటరమణ

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : 2025 నాటికి జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా మార్చాలని, ఇందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ పిలుపునిచ్చారు. ప్రపంచ టిబి(క్షయ) రహిత దినోత్సవ కార్యక్రమం శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిబి లక్షణాలు ఉన్న వారిని ప్రాథమిక దశలోనే గుర్తించి పరీక్షలు చేయించాలన్నారు. వ్యాధి గ్రస్తుడి ఇంటిని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సందర్శించి క్షయ వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. బాధితులను గుర్తించి చికిత్స అందించి ఆన్ లైన్ పోర్టల్ లో నమోదు చేసి, ప్రతి రోగికి రూ.500 పారితోషికం అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్ వో డాక్టర్ సుధార్ సింగ్, డిప్యూటీ డీఎంహెచ్ వో లు డాక్టర్ గోపాల్ రావు, డాక్టర్ ప్రకాష్, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

కుటుంబ నేపథ్యం..

హన్మకొండకు చెందిన నాయిని నరేందర్ రెడ్డి, జయమాల దంపతుల కుమారుడు నాయిని రాజేందర్ రెడ్డి.. జూలై 21 1969లో జన్మించారు. ఆయన విద్యాభ్యాసం హన్మకొండలోనే కొనసాగింది. డిగ్రీ (బీ.కామ్) పూర్తి చేశారు. ఆయన భార్య నీలిమా రెడ్డి, వీరి కూతురు గోదారెడ్డి.

కాంగ్రెస్‌లో కార్యక్రమాలు..

నాయిని రాజేందర్ రెడ్డి ప్రస్థానం కాంగ్రెస్ లో సామాన్య కార్యకర్తగా మొదలై అంచలంచెలుగా ఎదిగి ఎమ్మెల్యే స్థాయికి చేరుకున్నారు. విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పాల్గొన్నారు. 2014లో మడికొండలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బహిరంగ సభ విజయవంతంగా నిర్వహించారు. ➘ 2018లో భూపాలపల్లిలో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బహిరంగ సభను విజయవంతం చేశారు. ➘ 2022లో డీసీసీ అధ్యక్షుడిహోదాలో హన్మకొండ జిల్లాలో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ హాజరైన రైతు సంఘర్షణ సభను విజయవంతంగా నిర్వహించారు. ఈ సభలోనే వరంగల్ డిక్లరేషన్ ను ప్రకటించారు. ➘ 2022 అక్టోబర్ లో తెలంగాణాలో నిర్వహించిన జీ హాత్ సే హాత్ జోడో యాత్రలో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో కలిసి నాయిని పాల్గొన్నారు. 2023 ఫిబ్రవరి' 21వ తేదీన హనుమకొండ జిల్లాలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హాత్ సే హాత్ జోడో పాదయాత్రలో నాయిని పాల్గొని విజయవంతం చేశారు. 2023లో సీఎల్పీనే మల్లు భట్టి విక్రమార్కతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. 2023 అక్టోబర్ 18న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బస్సు యాత్రలో నాయిని రాజేందర్ పాల్గొన్నారు.

- సామాన్య కార్యకర్త నుంచి ఎమ్మెల్యేగా నాయిని రాజేందర్
- ప్రజా సమస్యలపై పోరాటం.. కాలనీల సమస్యలపై పాదయాత్రలు
- స్నేహానికి విలువనిచ్చే వ్యక్తిత్వం..
- నమ్ముకున్న కార్యకర్తలకు వెన్నంటే..
- కేసులు, బెదిరింపులు, నిర్బాంధాలకు లొంగని నేత
- ప్రాణం ఉన్నంత వరకు కాంగ్రెస్ తోనే పయనమంటున్న నాయిని...

పోరాడి.. లక్ష్యం ముద్దాడి!

స్నేహానికి ప్రాణామిస్తారాయన.. నచ్చిన, మెచ్చిన వ్యక్తి కోసం ఎంత వరకైనా పోరాటం చేస్తారు. కార్యకర్తలకు వెన్నంటే ఉంటారు. కేసులు, నిర్బాంధాలు లొంగని నైజం ఆయనది. బెదిరింపులకు భయపడని ధీరత్వం ఆయనది. ఇతర పార్టీల నుంచి ఆఫర్ వచ్చినా సున్నితంగా తిరస్కరించారు. కాంగ్రెస్ లో సామాన్య కార్యకర్తగా ప్రారంభమైన ఆయన ప్రస్తానం.. ఎమ్మెల్యేగా గెలిచి నిలిచారు. ప్రజాక్షేత్రంలో సమస్యలపై పోరాటం చేసి వాటి పరిష్కారానికి కృషి చేశారు. ఒడిదొడుకులు.. అవమానాలు.. అవహేళనలు, కష్టాలు, నష్టాలు భరించి చివరకు అనుకున్న లక్ష్యం సాధించారు. అసెంబ్లీలో అడుగు పెట్టి తన ఆకాంక్ష నెరవేర్చుకున్నారు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.. ఆయన కుటుంబ నేపథ్యం, రాజకీయ ప్రస్థానం తదితర అంశాలపై "అక్షర దర్బార్' ప్రత్యేక కథనం..

– అక్షర దర్బార్, వరంగల్ ప్రధాన ప్రతినిధి

అభివృద్ధిపై ఫోకస్..

ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన నాయిని రాజేందర్ రెడ్డి తన నియోజకవర్గంలో అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అంతేకాకుండా పెండింగ్ లో ఉన్న పనులపై ఫోకస్ పెట్టారు. భద్రకాళి మాడవీధులకు సంబంధించిన పనులు గత కొంత కాలంగా పెండింగ్ లో ఉంటున్నాయి. దీంతో సంబంధిత శాఖ మంత్రి, అధికారులతో సమావేశం నిర్వహించి అవసరమైన నిధులు మంజూరు చేయించారు. పనుల్లో వేగం పెంచారు. నయీంనగర్ డ్రైన్ కాల్వ కోసం రూ.70 కోట్లు మంజూరు చేయించి పనుల్లో వేగం పెంచారు. బీఆర్ ఎస్ అధికారంలో ఉన్నప్పటి నుంచి హన్మకొండలోని కాళోజీ కళా క్షేత్రం పనులు కొనసాగుతున్నాయి. ఆ పనులపై దృష్టిసారించిన నాయిని అవసరమైన నిధులు మంజూరు చేయించి పనుల్లో వేగం పెంచారు. రెండు, మూడు నెలల్లో పనులు పూర్తి అయ్యే అవకాశం ఉంది. హైదరాబాద్ హైవేలో ఉన్న రాంపూర్ వద్ద హన్మకొండ, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కన్ ఫ్యూజు అవుతున్నారు. దీంతో నేషనల్ హైవే అధికారులు డిజైన్ లోపంతో ఈ సమస్య తలెత్తుతుందని భావించి మంత్రులకు చూపించారు. అక్కడ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. అంతేకాకుండా కాజీపేట దర్గా నుంచి హంటర్ రోడ్ సీఎస్ ఆర్ గార్డెన్ వద్ద కలిసే రోడ్ కు రూ.40 కోట్లు మంజూరు చేయించారు. నియోజకవర్గంలో బీటీ రోడ్ల కోసం రూ.101 కోట్లు మంజూరు చేయించారు.

దాస్యంను ఓడించిన నాయిని..

విద్యార్థి దశ నుంచే నాయిని రాజేందర్ రెడ్డి ఎన్ ఎస్ యూఐలో చురుగ్గా పాల్గొన్నారు. ప్రజా సమస్యలపై గళం విప్పారు. అంచెలంచలుగా ఎదిగి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా అయ్యారు. కాంగ్రెస్ పార్టీ భీ పామ్ వస్తే చాలు అనుకున్న నాయిని ఏకంగా ప్రభుత్వ ఛీప్ విప్ , బీఆర్ ఎస్ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఓడించారు. అయితే, ఆయన 20 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం దక్కింది. గతంలో అవకాశాలు వచ్చినట్టే వచ్చి చేజారాయి. అయినా నిరుత్సాహ పడలేదు. ఇతర పార్టీల నుంచి అవకాశాలు వచ్చినా కాంగ్రెస్ జెండా వీడలేదు. పార్టీ మారాలని అనేక కేసుల్లో ఇరికించి జైలుకు పంపించినా.. కాంగ్రెస్ జెండా మోశారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. బీఆర్ ఎస్ , బీజేపీ నుంచి మంచి ఆఫర్ లు వచ్చినా సున్నితంగా తిరస్కరించారు. పార్టీ అధికారంలో ఉన్నా.. లేకపోయినా.. ప్రజాక్షేత్రంలోనే ఉన్నారు. ప్రజా సమస్యలపైనే పోరాటం చేశారు. ఎమ్మెల్యే కాక ముందునుంచే ప్రజలతోనే ఉంటారు. ప్రజల కోసం తపనపడుతారు.



పదవులకు వన్నెతెచ్చిన నేత..

➘ నాయిని రాజేందర్ రెడ్డి ఏ పదవి చేపట్టిన నిబద్ధతగా పనిచేస్తారు. పదవులకు వన్నెతెస్తారంటే ఆయన కమిట్ మెంట్ అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ఫార్మసిస్ట్ యూనియన్ వరంగల్ రీజియన్ అధ్యక్షుడిగా పనిచేశారు. వరంగల్ జిల్లా ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా పనిచేశారు. టీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ వరంగల్ రీజియన్ ప్రెసిడెంట్ గా పని చేస్తున్నారు. అంతకు ముందు 1985లో ఎన్ ఎస్ యూఐ వరంగల్ నగర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1987లో హన్మకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ & సైన్స్ కాలేజీలో ప్రెసిడెంట్ గా పనిచేశారు. 1988లో ఎన్ ఎస్ యూఐ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నామినేట్ అయ్యారు. 1998 నుంచి 2015 వరకు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. హన్మకొండ ఎన్నికల ఇంచార్జిగా పనిచేశారు. వరంగల్ జిల్లా లైబ్రరీ చైర్మన్ గా పని చేశారు. 2018 సంవత్సరంలో కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ కు అధ్యక్షుడిగా మళ్లీ నియమితులయ్యారు. 2022లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2023లో హనుమకొండ జిల్లా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

స్నేహానికి విలువ..

స్నేహానికి విలువనిచ్చే వ్యక్తి నాయిని రాజేందర్ రెడ్డి తాను నమ్ముకున్న కార్యకర్తలు, స్నేహితుల కోసం ఎంత వరకైనా వెళ్తారు. ఎదుటి వ్యక్తి వల్ల నష్టమని తెలిసినా పట్టించుకోరు. అలాగే వదిలేస్తారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కాంగ్రెస్ కార్యకర్తలను ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా వారికి అండగా నిలిచారు. వారి తరఫున పోరాటం చేశారు. కేసులు పెట్టి బెదిరించినా,, దాడులు చేసినా వెరవలేదు. కార్యకర్తలకు నేను ఉన్నానంటూ భరోసా ఇచ్చారు. వారిని అన్ని విధులా ఆదుకున్నారు.

ప్రజా సమస్యల కోసం పాదయాత్రలు..

వరంగల్ నగరంలో అనేక సమస్యలపై పోరాటం చేశారు నాయిని. ఛీప్ విప్ , ఎమ్మెల్యే ధాస్యం వినయ్ భాస్కర్ సమస్యలపై నిర్లక్ష్యం చేయడంతో నాయిని ప్రజలతో కలిసి పాదయాత్రలు చేశారు. వాటి పరిష్కరించేవరకు విశ్రమించలేదు. పశ్చిమ నియోజకవర్గంలో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉంటే అన్ని కేంద్రాలు చుట్టేశారు. ప్రజా సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారు. ఈ క్రమంలో ప్రత్యర్థి పార్టీ నాయకులు కేసులు పెట్టి ఇబ్బందులు గురిచేసినా.. వెనుకడుగు వేయలేదు. ప్రజలకోసం పోరాటం చేశారు.

కేసులు, దాడులకు బెదరలేదు..

నాయిని రాజేందర్ రెడ్డికి ఒకసారైనా కాంగ్రెస్ భీపామ్ తీసుకొని బరిలో నిలువాలనే కోరిక ఉండేది. ఎలాగైనా టిక్కెట్ దక్కించుకుని పోటీ చేయాలనే ఆకాంక్షబలంగా ఉండేది. ఆ కోరిక ఇప్పటికి నెరవేరింది. కాంగ్రెస్ బీ ఫామ్ సాధించడమ కాదు.. నాలుగు సార్లు విజయం సాధించిన దాస్యం వినయ్ భాస్కర్ ను ఓడించి మరో చరిత్ర సృష్టించారు. ఈ క్రమంలో ప్రత్యర్థి పార్టీలు కేసులు, దాడులు చేసినా బెదరలేదు. నిర్బాంధాలు పెట్టిన భయపడలేదు. లక్ష్యం కోసం ముందుకు సాగారు. చివరికి అనుకున్నది సాధించారు. కార్యకర్తలు కూడా కేసులై జైలుకు వెళ్తే వారిని ఎంత ఖర్చు అయినా బయటకు తీసుకొచ్చేవారు. వారికి అండగా నిలిచారు. అంతేకాదు, స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో తన అనుచరులను కార్పొరేటర్లుగా నిలబెట్టి గెలిపించుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా.. కులమత భేదాలు లేకుండా అందరివాడిగా నిలిచారు నాయిని రాజేందర్ రెడ్డి..

కవిత ఈడీ కస్టడీ
గడువు పొడిగింపు

- హైదరాబాద్ లో ఈడీ సోదాలు
- న్యాయపోరాటం చేస్తాం.. : ఎమ్మెల్సీ కవిత

అక్షర దర్బార్, హైదరాబాద్: ఢిల్లీ లిక్కర్ కేసులో అరెస్టు అయిన ఎమ్మెల్సీ కవిత ఈడీ కస్టడీ శనివారంతో పూర్తయ్యింది. కాగా, మధ్యాహ్నం కోర్టులో ప్రవేశపెట్టిన ఈడీ మరో ఐదు రోజుల పాటు కస్టడీ గడువు పొడిగించాలని కోరగా, రౌస్ అవెన్యూ కోర్టు మరో మూడు రోజులు పొడిగించింది. ఫలితంగా మరో మూడు రోజులపాటు కవితను ఈడీ ప్రశ్నించనుంది. తిరిగి మార్చి 26వ తేదీన ఉదయం 11 గంటలకు కవితను కోర్టులో హాజరుపర్చనున్నారు. కోర్టులోకి వెళ్లే సమయంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. గతంలో అడిగిన వివరాలనే మళ్లీ మళ్లీ అడుగుతున్నారని అన్నారు. పూర్తిగా తప్పుడు కేసును బనాయించారని, కొత్తగా అడిగింది ఏం లేదన్నారు. తన అరెస్టుపై న్యాయపోరాటం చేస్తామనని చెప్పారు.

హైదరాబాదులో ఈడీ సోదాలు..

మరోవైపు శనివారం ఏడుగురితో కూడిన ఈడీ అధికారుల బృందం హైదరాబాదులోని మాదాపూర్ లో సోదాలు చేపట్టింది. ఇక్కడ ఉన్న ఓ అపార్ట్ మెంటులో ఉంటున్న కవిత ఆడపడుచు అఖిల నివాసంలో ఈ తనిఖీలు జరిగాయి. అయితే కవిత కస్టడీలో ఉండగానే బంధువుల ఇళ్లల్లో సోదాలు జరపడం చర్చనీయాంశమైంది.

లైంగిక దాడికి యత్నించిన ఇన్ స్పెక్టర్‌పై
సస్పెన్షన్ వేటు

ఇన్ స్పెక్టర్ సంపత్ కుమార్ (ఫైల్)

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : బాలికపై లైంగిక దాడికి యత్నించి పోక్సో కేసులో అరెస్టయిన భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైం ఇన్ స్పెక్టర్ బండారి సంపత్ కుమార్ ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్ –1 ఐజీ ఏవీ రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. సంపత్ కుమార్ గతంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కేయూ పోలీస్ స్టేషన్ ఎస్సైగా విధులు నిర్వహించే సమయంలో మహిళతో సంబంధం ఏర్పడింది. సదరు మహిళ కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఓ కాలనీలో నివాసం ఉంటోంది. ఇన్ స్పెక్టర్ సంపత్ తో పరిచయం ఏర్పడ్డాక మహిళ కాపురంలో గొడవలు ప్రారంభమయ్యాయి. భర్తకు దూరమైన ఆమెతో ఇన్ స్పెక్టర్ సహజీవనం చేయసాగాడు. ఈ విషయమై ఆమె భర్త గతంలో వరంగల్ పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సంపత్ ను వీఆర్ కు అటాచ్ చేశారు. కొద్ది రోజులకు పదోన్నతిపై భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైం ఇన్ స్పెక్టర్ గా విధుల్లో చేరిన సంపత్ తరుచూ సదరు మహిళ ఇంటికి వచ్చి పోయే క్రమంలో ఆయన దృష్టి ఆమె కూతురుపై పడింది. ఈ క్రమంలో ఇటీవల సదరు బాలికపై లైంగికదాడికి యత్నించాడు. దీంతో భయాందోళనకు గురైన సదరు మహిళ కేయూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. భద్రత కల్పించాల్సిన పోలీస్ అధికారి బాలికపై లైంగికదాడికి యత్నించినందుకు సంపత్ పై శాఖాపరమైన తీసుకున్నారు. ఆయన్ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్– 1 ఐజీ ఏవీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

రాములోరిని దర్శించుకున్న బలరాం నాయక్

అక్షర్ దర్బార్, ఏటూరు నాగారం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామిని మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనవెంట మాజీ గ్రంథాలయ చైర్మన్ బోగల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు నరేష్, నాయకులు అంగోత్ బలరాం నాయక్, కిషన్ నాయక్, నరేష్, రాము ఉన్నారు.

బలరాం నాయక్ ను సన్మానిస్తున్న నాయకులు

మంత్రి శ్రీధర్ బాబును
కలిసిన వంశీకృష్ణ

మంత్రిని సన్మానిస్తున్న వంశీ కృష్ణ

అక్షర దర్బార్, మల్హార్ : రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును శనివారం కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబుకు వారు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి వంశీ కృష్ణకు టికెట్ కేటాయించడంపై మంత్రి శ్రీధర్ బాబు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయులకు
ప్రత్యేక టెట్ నిర్వహించాలి

పీఆర్టీయూ నడికూడ అధ్యక్షుడు అచ్చ సుదర్శన్

అక్షర దర్బార్, పరకాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కాకుండా ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలని పీఆర్టీయూ నడికూడ మండల శాఖ అధ్యక్షుడు అచ్చ సుదర్శన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టెట్ సర్టిఫికెట్ ఉంటేనే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో చాలా మంది ఉపాధ్యాయులకు టెట్ సర్టిఫికెట్ లేదని, దాంతో వారికి పదోన్నతులు నిలిపివేశారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ తో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.

కాంస్య పతకం విజేత ఏసీపీకి సన్మానం

ఏసీపీని అభినందిస్తున్న సీపీ

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : ఆల్ ఇండియా బ్యాడ్మింటన్ పోటీల్లో అదనపు ఎస్పీ వెంకట్రావ్, ఏసీపీ జితేందర్ రెడ్డి కాంస్య పతకం సాధించారు. ఈ నెల 17 నుంచి 22 వరకు హైదరాబాద్లోని పుల్లెల గోపీచంద్అకాడమీలో 16వ ఆల్ ఇండియా పోలీస్బ్యాడ్మింటన్చాంపియన్షిప్పోటీలు జరిగాయి. 55 ఏళ్ల విభాగం డబుల్స్ పోటీల్లో అదనపు ఎస్పీ వెంకట్రావ్ , ఏసీపీ జితేందర్ రెడ్డి పాల్గొని కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. కాగా, వరంగల్పోలీస్కమిషనరేట్లో స్పెషల్బ్రాంచ్ఏసీపీగా జితేందర్ రెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. ఆయన గతంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన పోలీస్బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ లో బంగారు పతకంతో పాటు మరికొన్ని పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ సీపీ అంబర్కిషోర్ ఝా ఏసీపీని సన్మానించారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాలను
తనిఖీ చేసిన కలెక్టర్

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : పదో తరగతి పరీక్ష కేంద్రాలను కలెక్టర్ పి.ప్రావీణ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాశీబుగ్గ నరేంద్ర నగర్ ప్రభుత్వ పాఠశాల, ఎల్బీ నగర్ లర్నర్స్ ల్యాండ్ పాఠశాలను ఆమె సందర్శించారు. మౌలిక సదుపాయాలు, పరీక్షల నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలను చీఫ్ సూపరింటెండెంట్ ను అడిగి తెలుసుకున్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పర్యవేక్షించాలని ఇన్విజిలేటర్లను కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించొద్దని, కేంద్రం సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని ఆదేశించారు. 144 సెక్షన్ పటిష్టంగా అమలుచేయాలని పోలీసులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, చీఫ్ ఎగ్జామినర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సిబ్బందిని వివరాలు అడుగుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కేశవాపురం ఆలయం ముస్తాబు

నేటి నుంచి అష్టాదశ బ్రహ్మోత్సవాలు

దుగ్గొండి, అక్షర దర్బార్ : మండలంలోని కేశవాపురం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నేటి నుంచి అష్టాదశ బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి – పూలమ్మ, నిర్వాహకులు కంది జితేందర్ రెడ్డి–సరళ, కంది మనోహర్ రెడ్డి–కృష్ణవేణి ఆధ్వర్యంలో గ్రామస్తులు శనివారం ఆలయ శుద్ధీకరణ పనులు చేపట్టారు. ఈనెల 24 నుంచి 27 వరకు బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు జితేందర్ రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.